# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

# The Bombay Andhra Mahasabha & Gymkhana


జనవరి-ఫిబ్రవరి 2012

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల..


# దర్పణం



## "అఖిల భారత నృత్యోత్సవాలు - 2012"









తెలుగు చిత్రసీమకు ముంబయితో అనుబంధం

## ఉగాది శుభాకాంక్షలు


S.V. CLASSES
(The Scholar's Classes)
నూతన సంవత్సర, సంక్రాంతి
గణతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు...
ADMISSIONS CLOSED FOR
XII SCIENCE 2012-13
X (S.S.C.) Vaction cum Regular Batch
NOW ADMISSIONS ARE AVAILABLE FOR
X (S.S.C.) REGULAR BATCH
Commencing from 1st June,2012
Inauguration Of New Administration Office
On : 26th January, 2012
At : 121/1, B.D.D. Chawls, S.S. Amrutwar marg, Worli, Mumbai - 18,

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
# The Bombay Andhra Mahasabha & Gymkhana
10-C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400014. Tel. 24144377 / 24144388, Fax: 24119832.



సారథ్యం
**శ్రీపోతు రాజారాం**

సంపాదకులు
**కె. బాబురావు**

సమన్వయ సంపాదకులు
**నడిమెట్ల యెల్లప్ప**
**గుంటుక పరుశురాం**

సహ సంపాదకులు
**కొంకల థామస్ రెడ్డి**
**బడుగు విశ్వనాథ్**
**జి. గంగారాజం**


## మా మాట

**మహాసభ సభ్యులకు నమస్కారం!**

ఆంధ్రమహాసభ నిర్వహిస్తున్న కార్యక్రమాల పట్ల మీరు చూపిస్తున్న ఆదరణకు మా ధన్యవాదాలు. సాధారణంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగలు, వేడుకలే గాకుండా సాహిత్యసేవలో మరియు కళారాధనలో సభ్యులకు మా చేతనైనంత సేవలందించడానికి సదా కృషి చేస్తున్నాం. కళారాధకులైన గౌరవ సభ్యులు గానీ, సాహితీ ప్రియులుగానీ, జనరంజకమైన, వైవిధ్యమున్న కార్యక్రమాల్ని సూచించినచో వాటిని వివిధ ప్రాంతాల్నుండి తీసుకొని వచ్చి మీముందుంచే ప్రయత్నం చేయగలం. అంతేగాక ముంబైలో వివిధ రంగాల్లో స్థిరపడియున్న తెలుగు వారి అభిరుచులకు అద్దం పట్టే కార్యక్రమాలేగాక ప్రయోజనకర కార్యక్రమాలు కూడా మీముందుంచే ప్రయత్నాలు సాగుతున్నాయి. కళారాధనలో ఆంధ్రమహాసభ కీర్తిని ఇనుమడింప చేయాలనే ఉద్దేశ్యంతో, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదువారి సహకారంతో ఈ సారి జాతీయస్థాయిలో “నృత్యోత్సవాలు” మన ఆంధ్రమహాసభ ఆవరణలో ఘనంగా జరగనున్నాయి. అలాగే మున్ముందు ఎన్నో జనరంజకమైన, ప్రయోజనకరమైన చక్కని కార్యక్రమాల్ని మీముందుంచే ప్రయత్నం చేయగలమని హామీ యిస్తున్నాం.

మనందరం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకుందాం. మీ అందరికీ ఇదే మా ఆహ్వానం.

మన తెలుగువారు గర్వించదగ్గ కార్యక్రమాలు జరుపుకుందామనే భావనతో కొన్ని ప్రత్యేక కార్యక్రమాలుకూడా ఈ నెలలో జరపాలని నిర్ణయించాము. ఈ కార్యక్రమాలు ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దాలని కూడా యోచిస్తున్నాము. రాబోయే కార్యక్రమ వివరాలు లోపలి పుటలలో పొందుపరచాము. ఆస్వాదించండి.

ఇవే మీఅందరికీ **ఉగాది శుభాకాంక్షలు**, జరగబోయే కార్యక్రమాలకు హార్థికాహ్వానాలు.

సంపాదకులు
**కె. బాబురావు**

# మహాసభలో జరుగబోయే కార్యక్రమాలు

## తేది 14-03-2012, బుధవారం, "అంతర్జాతీయ మహిళా దినోత్సవ" వేడుకలు

ఆంధ్రమహాసభ మహిళా శాఖ ఆధ్వర్యంలో మార్చి 14వ తేది బుధవారం ఉదయం 10.30 గంటల నుండి 4 గంటల వరకు "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" జరుపబడును. ఈ సందర్భంగా ప్రముఖ, రచయిత్రి డా॥ త్రివేణి, శ్రీమతి కె. సుజాతా మూర్తిఆంధ్ర ఎడ్యుకేషన్ సోసైటి మరియు జూనియర్ కాలేజ్ ప్రిన్స్‌పాల్ మరియు పలువురు మహిళలకు సన్మాన కార్యక్రమములు నిర్వహించబడును. వివిధ ప్రాంతాలకు చెందిన చీరలు అందంగా పొందికగా అలంకరించుకొని ప్రదర్శించు మహిళలకు "పొందికైన మహిళ" బిరుదుతో పాటు పోటీలో గెలిచిన వారికి బహుమతులు ఇవ్వబడును.

ఈ పోటీలో పాల్గొను మహిళలు ముందుగా మహిళాశాఖ అధ్యక్షురాలు పి. భారతలక్ష్మి 9320036339 లేక కార్యదర్శి సోమల్ లత 9322706123 కి గాని తెలియ చేసి పేర్లు నమోదు చేసుకోవలెను. ఇంకా ఈ కార్యక్రమములో పద్యాలు ఆలపించుట, ప్రముఖ మహిళలపై ప్రసంగాలు, ఒక నిముషం 'తెలుగు మాత్రమే' మాట్లాడటం, క్విజ్‌లు మరియు హౌసీ, మొదలగు కార్యక్రమములు జరుగును. కావున మహిళ లందరూ ఈ కార్యక్రమమునకు వచ్చి జయప్రదం చేయవలసినదిగా కోరుచున్నాము.


## తేది 23-03-2012, శుక్రవారం, "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవము" మరియు "ఉగాది వేడుకలు"



ఆంధ్ర మహాసభలో "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవము (21.02.2012) సందర్భాన్ని పురస్కరించుకొని "నందన నామ సంవత్సర ఉగాది (23.03.2012) వేడుకల సందర్భంగా సాయత్రం 5 గంటల నుండి పంచాంగ శ్రవణం మరియు ఉగాది పచ్చడి వితరణ జరుగును. తెలుగు భాషాబివృద్ధికై, భాషాపరిరక్షణకై బొంబాయి ఆంధ్ర మహాసభలో "మాతృభాష ప్రాముఖ్యత" పై ప్రసంగం మరియు కవిసమ్మేళనము జరుగును. ఇట్టి కార్యక్రమంలో హైద్రాబాదు నుండి "కవి శిరోమణి" (రిటైర్డు తెలుగు ప్రొఫెసర్) ఆచార్య రావికంటి వసునందన్ పాల్గొంటారు. ముంబయి మరియు పరిసర ప్రాంతాలనుండి కవులు, కవియిత్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మనవి.

## "తెలుగు" ఉచిత శిక్షణా కేంద్రము






తెలుగు అకాడమి హైదరాబాదు మరియు ది బొంబాయి ఆంధ్రమహాసభ సంయుక్తంగా ఉచిత తెలుగు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు.

ముంబయిలో నివసిస్తున్నటువంటి తెలుగు వారు, వారి పిల్లలు ఇంట్లో తెలుగు మాట్లాడుతున్నారు. కానీ కొందరికి రాయడం చదవడం రాదు. ఇట్టి సమస్యను దృష్టిలో పెట్టుకొని బొంబాయి ఆంధ్రమహాసభలో ఉచిత తెలుగు శిక్షణా కేంద్రం ప్రారంభించనున్నాము. ఉత్సాహము కలిగిన వారు తమ తమ పేర్లను ఆంధ్రమహాసభలో నమోదు చేసుకోగలరు. ఇట్టి సదవకాశము తెలుగు వారందరికి కల్పించ బడుచున్నది.

# "అఖిల భారత నృత్యోత్సవాలు - 2012"

## తేది 31-03-2012, శనివారం మరియు 01-04-2012, ఆదివారం





ది బొంబాయి ఆంధ్రమహాసభ & జింఖానా, ముంబయి మరియు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ సంయుక్తంగా "అఖిల భారత నృత్యోత్సవాలు - 2012" కార్యక్రమాన్ని 31.03.2012 శనివారం మరియు 01.04.2012 ఆదివారము ముంబాయిలో ఘనంగా నిర్వహిస్తున్నాము.

ఇందులో భాగంగా అలనాటి ప్రముఖ సినీ నటీమణులైన శ్రీమతి మంజుభార్గవి (శంకరాభరణం ఫేమ్), శ్రీమతి కోటి సూర్యప్రభ (దానవీరశూరకర్ణ ఫేమ్) మరియు రూపిణి (ఎన్నో హిందీ చిత్రాలలో నటించిన సినీనటి, నర్తకి) లాంటి మన్ననలను పొందిన నర్తకీ మణులు తమ నృత్యప్రదర్శనలతో మన అందరిని అలరించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిదులుగా ప్రముఖ సినీ కళాకారిణి శ్రీమతి జయసుధ మరియు ప్రముఖ హాస్యనటుడు రాజేంద్రప్రసాద్ విచ్చేయనున్నారు.

వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నృత్యకాళాకారులు

**కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి, భరతనాట్యం, ఒడిస్సీ, కథకళీ**

నృత్యాలతో కన్నులవిందుగా నృత్య ప్రదర్శనలు చేసి "మేరా భారత్ మహాన్" అనే నినాదానికి సార్ధకత చేకూర్చనున్నారు. ఆంధ్రప్రదేశ్ మరియు మహారాష్ట్ర నుండి ఎందరో సినీ మరియు రాజకీయ ప్రముఖులు ఈ ఉత్సవాలకు అతిథులుగా విచ్చేయనున్నారు. పూర్తి వివరాలు మరియు సంబంధిత నటీనటుల నర్తన వివరాలు ముందు పేజీల్లో పొందుపరచాము. ఈ రెండు రోజుల కార్యక్రమానికి మీరందరు విచ్చేసి ఉత్సవాలను జయప్రదం చేయవలసినదిగా సభ్యులందరినీ కోరుచున్నాము.









# PROGRAM ITINERARY

## Date : Saturday 31.03.2012, Evening session - 6.00 pm to 10 pm

- Inaugural Function
- PRESENTATION BY THE DEPT. OF DANCE
  by Potti Sriramulu Telugu University, Hyderabad
- ANDHRANATYAM PERFORMANCE
  by Potti Sriramulu Telugu University, Hyderabad
- PERINI SIVATANDAVAM
  By Telugu University & Group, Hyderabad
- KUCHIPUDI DANCES & BALLETS BY :
  Smt. Smitha Sastry, Ahmedabad
  Mrs. Roopini Film Artist, Mumbai
  Sri Siddhendra Kala Peetham, Kuchipudi , A.P.
- KATHAK DANCE
  by Smt. Leena & Smt. Poornima, New Delhi.
- MOHINIATTAM
  by Smt. Gopika Verma - Chennai

## Date : Sunday, 01.04.2012, Morning session 10 am to 1 pm

- LECTURE DEMONSTRATION / PERFORMANCES BY :
  - Sri Pasumarthy Keshava Prasad & Party - Kuchipudi, A.P.
  - Sri Sivanand, Tanuku
  - Kuchipudi Kala Kendra, Mumbai
  - Smt. Bala Kondal Rao, Vishakapatnam
  - Dr. Suvachal Devi, Hyderabad.

## Date : Sunday, 01.04.2012, Evening session 6 pm to 10 pm

- KUCHIPUDI DANCE BY :
  - Smt. Radha Mohan, Mumbai
  - Smt. Prabha Ramesh, Cine Artist, Chennai (Dana Veera Sura Karna fame)
  - Dr. Alekhya Punjala, Hyderabad
  - Smt. Manjubharghavi, Bangalore ("Sankara Bharanam" fame)
- IMAGES OF INDIA
  By S.K.Kuchipudi Dance College, Mumbai
- ANDHRANATYAM
  By Sri Prashant & group, Nizamabad

# జరిగిన కార్యక్రమాల దర్పణం

## తేది 03-01-2012, గురువారం "వెల్‌కమ్ - 2012 (స్వాగతం - 2012)" వేడుకలు




ఆంధ్ర మహాసభ మహిళాశాఖ ఆధ్వర్యంలో తేది 03.01.2012, మధ్యాహ్నం 3.00 గంటల నుండి "వెల్‌కమ్ - 2012 (స్వాగతం - 2012)" నూతన సంవత్సర వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ముందుగా మహిళాశాఖ కార్యదర్శి శ్రీమతి సోమల్ లత అందరికీ స్వాగతం చెప్పి ఆహ్వానించారు. తదుపరి కార్యదర్శి సభ్యురాలు టి. అపరాజిత ఒక చక్కటి గేమ్ నిర్వహించారు. స్ట్రాలు, పూలు, ఉపయోగించి చేసిన గేమ్‌లో పి.శ్రీకళ, సరోజ బహుమతులు పొందారు. అనంతరం ఆంధ్రా స్కూల్ పిల్లలచే "ఆడపిల్లలకు చదువు చాలా అవసరం" అని చెప్పే ఒక సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటి హైస్కూలు ఉపాధ్యయులు ఎస్. జ్యోతి, జయంతి నిర్వహించారు. వీరిని మహిళాశాఖవారు, అధ్యక్షురాలు పి. భారతలక్ష్మి కార్యదర్శి సోమల్ లత మరియు కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. నాటికలో పాల్గొన్న పిల్లలకు బహుమతులంద జేశారు. అనంతరం న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. ఆ తర్వాత చిన్న చిలిపి ప్రశ్నలు క్విజ్ నిర్వహించారు. ఆఖరుగా హౌసీ గేమ్ ఆడారు. సగ్గుబియ్యంతో రకరకాల పిండి వంటలు చేసిన వారికి బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అందరకూ మహిళశాఖ అభినందనలు, శుభాకాంక్షలు తెలియ చేశారు.



## తేది 21-01-2012, శనివారం "సంక్రాంతి సంబరాల" వేడుకలు

ఆంధ్ర మహాసభ మహిళాశాఖ ఆధ్వర్యంలో శనివారము తేది 21.01.2012, మధ్యాహ్నం 2.00 గంటల నుండి 'సంక్రాంతి సంబరాలు" అనే కార్యక్రమం ఎంతో సరదాగా జరిగినది. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎందరో మహిళలు పోటీలలో పాల్గొన్నారు. ముచ్చటైన సంక్రాంతి సందర్భాన్ని వివరించే మూడు ముగ్గులను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. ముగ్గుల పోటీలలో పి. శ్రీకళ, సిహెచ్. పరమేశ్వరి మరియు జి. భాగ్యవతి బహుమతులు గెల్చుకున్నారు. పోటీలో పాల్గొన్న వారందరికీ కూడా ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. లీలారావు, జయశ్యామల, శారదా వెంకటేష్ గార్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.





తదుపరి సంగీత విద్వాంసురాలు పద్మావతీ త్యాగరాజు సంగీత కచేరీ జరిగింది, పద్మావతీ త్యాగరాజు గారు తన గానమాధుర్యంతో ఎన్నో పాటలు పాడారు. వీరి పాటలకు మృదంగంపై శ్రీరామ్, వయొలిన్‌పై ముకుంద్ గార్లు సంగీత సహకారం అందించారు. పద్మావతి గారు ఎంతో శ్రావ్యంగా ఎన్నో పాటలు పాడగా "కొలనిదో పరికి గొబ్బిళ్ళో" అనే అన్నమాచార్య గీతానికి మహిళలందరూ ఎంతో ఉత్సాహంగా గొబ్బిళ్ళ నృత్యంచేశారు. ఇంకా 'కులుకగ నడవరో" అన్న గీతాన్ని, మరి పలుగీతాలను ఆలపించి ప్రేక్షకులకను ఆనందంలో ముంచి వేశారు. సంగీత కచేరీ పాటలు ఎంతో ఆద్యంతం ఆకట్టుకున్నాయి. తదుపరి మహిళలందరికీ 'జయ విఠల్' గారి పేరుమీద పసుపు కుంకుమలు, పళ్ళు, చిరుకానుకలు ఇచ్చి పంపారు. మహిళాశాఖ అధ్యక్షురాలు పి. భారతలక్ష్మీ, కార్యదర్శి సోమల్ లత, పద్మావతీ త్యాగరాజు గారిని పుష్పగుచ్ఛం, శాలువా, కానుకలతో ఘనంగా సత్కరించారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళ లందరికీ ప్రోత్సాహక బహుమతలను ఇచ్చి పంపారు. కార్యక్రమం ఎంతో బావుందని, సాంప్రదాయంగా చేశారని, ఇలాగే ముమ్ముందు చక్కగ నిర్వహించాలని అందరూ కోరారు. చివరిగ అందరికీ మహిళాశాఖ కార్యవర్గం అభినందనలతో సభ ముగిసింది.




# Abhinaya College of Dance & Music

**(Registered by Govt. of Maharashtra, Regd. No. 265)**

**Affiliated to Telugu University of Hyderabad**





## BHARATNATYAM DANCE CLASSES,

### KUCHIPUDI DANCE CLASSES & KARNATAKA MUSIC


**Diplama, MA and PG Courses**

**Tel.: 022 - 28347460 Mob.: 9757124466**


**Venue Branches**

Andheri (E) : Green field society, A 3/16, 1st Floor, J.V. Link Road, Andheri (E), Mumbai - 400 093
Vashi : Telugu Kala Samithi, Sector - 9/A, Vashi, Navi Mumbai
Bandra (W) : Sea View Bldg. No. 23/11, K.C. Marg, Bandra Reclamation, Bandra (W) - 50

## తేది 22-01-2012, ఆదివారం "విహార యాత్ర (పిక్నిక్) " వేడుకలు



ఆంధ్ర మహాసభ మహిళశాఖ ఆధ్వర్యంలో ఆదివారము తేది 22.01.2012, ఉదయం 8.00 గంటల నుండి విహారయాత్రకు 8 బస్సులలో "పనారామిక్ రిసార్ట్ & వాటర్ పార్కు" కు విహార యాత్రకు బయలు దేరి వెళ్ళారు. అక్కడికి చేరిన తర్వాత ముందుగా సభ్యులందరి పరిచయం జరిగింది. పాటలు పాడారు, మ్యూజికల్ చైర్స్, 4 కార్నర్స్ మరియు చిన్న చిన్న ప్రశ్నలతో వచ్చిన అందరి చేత ఆటలు ఆడించి బహుమతులు ఇచ్చారు. తరువాత మధ్యాహ్నన భోజనాలు చేసి హౌసీ ఆడారు. దంపతులకు చిన్న చిన్న ప్రశ్నలువేసి వారిమధ్య ఎంత అవగాహన ఉందో తెలిపే కార్యక్రమం నిర్వహించారు. అందరూ ఆటపాటలతో ఎంతో ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ అధ్యక్షులు శ్రీ పోతు రాజారాం, కార్యదర్శి శ్రీ కె. బాబురావు, మహిళాశాఖ అధ్యక్షురాలు శ్రీమతి పొన్నూరి భారతలక్ష్మి, కార్యదర్శి శ్రీమతి సోమల్ లత, సహాయ కార్యదర్శి టి. అపరాజిత పాల్గొని ఆటల పోటీలలో వాల్గొన్న అందరికీ బహుమతలు పంచి, వచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎంతో ఉత్సాహంగా, పాటలు పాడుతు ఆనందంగా బస్సుల్లో పయనించి సాయంత్రం ఇళ్ళకు చేరుకున్నారు.







## తేది 26-01-2012, గురువారం "గణతంత్ర దినోత్సవ" వేడుకలు



గురువారము 26.01.2012 న ఉదయం 10.00 గంటలకు 64వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా మహాసభ ఆవరణలోఅధ్యక్షులు పోతు రాజారాంగారు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తర్వాత ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మహిళాశాఖ అధ్యక్షురాలు పి. భారతలక్ష్మిగారు జాతీయ గీతాన్ని మరియు కొన్ని దేశభక్తి గీతాలను ఆలపించారు. ప్రముఖ గాయకుడు మధుబాబు, హైదరాబాదు వారి బృందం కొన్ని దేశభక్తి గీతాలు వినిపించి అందరిని అలరించారు. ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటి స్కూలు సంగీత టీచర్ శిష్య బృందంతో కొన్ని దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేసి ఆహుతులను ఆనందపరిచారు. వివిధ తెలుగు పాఠశాలల నుండి విద్యార్థి, విద్యార్థునులు బ్యాండ్ మార్చ్ నిర్వహించారు. విచ్చేసిన అతిథులకు మహాసభ సభ్యులకు అల్పాహారం అందించారు ఈ సందర్భంగా అధ్యక్షులు పోతు రాజారాం, ట్రస్టు చైర్మన్ ఎల్.వి. రావు గార్లు తమ సందేశాన్ని సభికులకు అందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికి ప్రధాన కార్యదర్శి కె. బాబురావు గారి ధన్యవాదాలతో సభ ముగిసింది.




# తేది 04-02-2012, శనివారం "సాంస్కృతిక, విద్యాకార్యక్రమాల" వేడుకలు



తేది 04.02.2012 శనివారము సాయంత్రము 6.30 గంటలకు ఆంధ్ర మహాసభ ప్రాంగణంలో సాంస్కృతిక, విద్యాకార్యక్రమాలు మరియు పది & పన్నెండవ 2010 – 11 తరగతులలోఅధిక మార్కులలో ఉత్తీర్ణులైన 108 మంది విద్యార్థినీ విద్యార్థులకు పారితోషికం, పురస్కారాలు మరియు ఆర్థికంగా బలహీన 25 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ముఖ్య అతిథి ఆచార్య కె. యాదగిరి, కులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మరియు గౌరవ అతథి శ్రీ అనిల్ కుమార్,





ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఎమ్. ఎల్.ఎ., బాల్గొండ గారి చేతుల మీదుగా అందివ్వ బడినది. ముఖ్య అతిథిని శ్రీ పోతు రాజారాం గారు మరియు గౌరవ అతిథి శ్రీ అనిల్ కుమార్ గారిని ప్రధాన కార్యదర్శి కె. బాబురావు గారు పుష్పగుచ్ఛం, మోమెంటో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మఖ్య అతిథి శ్రీ యాదగిరి గారు మాట్లాడుతూ ఆంధ్రమహాసభలో "తెలుగు శిక్షణా కేంద్రాన్ని" స్థాపించి నడపమని దానికి కావలసిన అర్థిక, సాంకేతిక సహాయం 'తెలుగు ఆకాడమి' హైదరాబాద్ తరపున అందిస్తామని, సభలోని గ్రంధాలయానికి కావలసిన కొత్త పుస్తకాల సేకరణలో కూడ సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్.ఎల్.ఎ., ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అనిల్ కుమార్ గారు టి.టి.డి సేవా కేంద్రాన్ని తిరిగి సభ ఆవరణలో పుణప్రారంభించడానికి తన శాయశక్తులా కృషి చేస్తామని తెలియ జేశారు. ఈ కార్యక్రమాన్ని హైదారబాదు నుండి వచ్చిన 'రంగస్థల నటుడు శ్రీ వనం శంకరయ్యగారు 'చింతమణి' ఏక పాత్రాభినయంతో ప్రారంభమై, అభినయ కాలేజ్ ఆఫ్ డాన్స్ అండ్ మ్యుజిక్ వారు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలతోనాటి కార్యక్రమం ముగిసింది



ఈ కార్యక్రమాన్ని సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి శ్రీమతి రాధామోహన్, సాహిత్య సాంస్కృతిక సంయుక్త కార్యదర్శి గుంటుక పరుశురాం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి మహాసభ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, ట్రస్టీలు, మహిళా శాఖ సభ్యులు మరియు తెలుగు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని సభను దిగ్విజయం గావించారు.








## తేది 18-02-2012, శనివారం "త్యాగరాజ ఆరాధన" వేడుకలు



ఆంధ్ర మహాసభలో మహిళశాఖ ఆధ్వర్యంలో శనివారము 18.02.2012 రోజున మధ్యాహ్నం 3.00 గంటల నుండి 'త్యాగరాజ ఆరాధన' కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా ప్రముఖ గాయకురాలు ఎన్.సి. సీతాదేవి, మహిళాశాఖ అధ్యక్షురాలు పి.భారతలక్ష్మి, కార్యదర్శి సోమల్ లత, జ్యోతి ప్రజ్వలన చేసి, త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి, నివాళులర్పించారు. తరువాత వీరితో కలిసి కొందరు స్థానిక కళాకారులు "శ్రీగణపతిని సేవింపరారే" అనే ప్రార్థనతో మొదలు పెట్టి ఘనపంచరత్న కీర్తనలు ఆలపించారు. తదుపరి పి. భారతలక్ష్మి, సోమల్ లత, టి. అపరాజిత, పి. పద్మ, వై. లత, జయశ్యామల, దేవీరావు, సూజాతా మూర్తి, సుశీల, మొదలగువారు 'రామా కోదండ రామ, సీతాకళ్యాణ వైభోగమే, గంధము పూయరుగా, పూల పాన్పుమీద' మున్నగు కీర్తనలను ఆలపించారు. తదుపరి స్థానిక కళాకారులు, శారదా వెంకటేశ్, ప్రమీల, విజయారావు, రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ, సీతాలక్ష్మి, లక్ష్మి, అరుణ్ మొదలగువారు అనేక కీర్తనలను ఆలపించి, త్యాగరాజ స్వామికి స్వరాంజలి అర్పించి, కార్యక్రమాన్ని రక్తికట్టించారు. చివరగా స్వామికి హారతులిచ్చి ముగించారు. ఈ కార్యక్రమానికి మృదంగంపై గోప కుమార్, వయెలిన్‌పై శ్రీమతి సుశీల వాద్య సహకారాన్ని అందించి ఆహుతులను అలరించారు. ఈ సంగీత కార్యక్రమంలో పాల్గొని పాడిన వారందరికీ అధ్యక్షురాలు, కార్యదర్శి మహిళాశాఖ తరుపున కానుకలిచ్చి సత్కరించారు. వచ్చిన వారందరూ పలహారములు సేవించి కార్యక్రమం బాగుందని కొనియాడారు. మహిళాశాఖ కార్య వర్గం అందరికీ అభినందనలు తెలిపారు.



## తేది 23,24 & 25-02-2012, గురు, శుక్ర మరియు శనివారాలు "ఆటల పోటీలు" వేడుకలు



ఆంధ్ర మహాసభలో మహిళశాఖ ఆధ్వర్యంలో గురువారము 23.02.2012, శుక్ర వారము 24.02.2012 మరియు శనివారము 25.02.2012 తేదీలలో మూడు రోజులు ఆటల పోటీలు జరిగాయి.

23వ తేది మొదటి రోజు, క్యారమ్స్, బ్యాట్ మెంటన్, బాస్కెట్ బాల్ మరియు 4 కార్నర్స్ గేమ్స్ జరిగాయి.

<u>క్యారమ్స్ విజేతలు</u>

మొదటి బహుమతి – టి. అపరాజిత, జి. లక్ష్మి

రెండవ బహుమతి – పొన్నూరి శ్రీకళ, సంధ్య

<u>బ్యాట్ మెంటన్ విజేతలు</u>

మొదటి బహుమతి – పొన్నూరి శ్రీకళ, భోగ జ్యోతి

రెండవ బహుమతి – సుసర్ల మాధవి, పి. కాంచన

<u>బాస్కెట్ బాల్ విజేతలు</u>

మొదటి బహుమతి – జి. లక్ష్మి,

రెండవ బహుమతి – పొన్నూరి భారతలక్ష్మి

**<u>4 క్యారమ్స్ గేమ్ విజేతలు</u>**

టి. అపరాజిత, పి. పద్మ, సంధ్య

**24వ తేది రెండవ రోజు "రమ్మీ" ఆట జరిగింది**

మొదటి బహుమతి – వి. అనసూయ

రెండవ బహుమతి – ఎమ్. లీలారావు

మూడవ బహుమతి – సుసర్ల వాణీరావు

**25వ తేది మూడవ రోజు "అడ్డాట" జరిగింది**

మొదటి, రెండవ మరియు మూడవ బహుమతుల విజేతలు – ఎమ్. లీలారావు, సుసర్ల వాణీరావు, వై. సత్యవతి, పి. భారతలక్ష్మి, అనసూయ వారణాసి, కె. ఉమారావు

# Free
## VOLLEY BALL & BADMINTON COACHING

**Conducted**

On Saturday & Sundays
at 6 am to 8 am &
5 pm to 7 pm




: Contact :
022 - 24144377 / 24144388





# Free Yoga Classes



Conducted by

**Sri Ambica Yog Kutir, Thane**

**At Andhra Mahasabha & Gymkhana**

New Batches Started

Contact:

022-24144377 / 88
98216 28636 / 98701 06924 /
98927 30164


# మహిళా దర్పణం

## మనవి

గత మూడు నెలలుగా మహిళాదర్పణంలో వంటలు మహిళల ఆరోగ్యసూత్రాలు మహిళలపై ప్రత్యేక వ్యాసాలు ప్రచురిస్తున్నాము.

ఇక నుండి మహిళల సృజనాత్మకతకు పదును పెట్టాలనే సదుద్ధేశ్యంతో, మహిళలురాసి పంపిన వ్యాసాలు, వంట వార్పుల వేశేషాలు, మహిళా సమస్యలపై చర్చనీయాం శాలైన విషయాలు మొదలగు వాటినే ప్రచురించాలను కుంటున్నాము.

మహిళాదర్పణం పేరుతో మేమే ఆర్టికల్స్ రాయడం సమంజసంగా అనిపించనందున ఆ అవకాశాన్ని మహిళలకే వదిలేస్తున్నాం. వేరే శీర్షికలకై మీరు ఏం రాసినా అభ్యంతరం లేదు కానీ, మహిళా దర్పణానికి మాత్రం మహిళలకు సంబంధించిన అంశాలను మహిళలే రాయాలి. షాపింగ్, కుకింగ్, ఎదిగే ఆడపిల్లలు, పెండ్లి సమస్యలు, ఆరోగ్య సమస్యలు ముగ్గులు, అల్లికలు సమకాలీన సమాజంలో మహిళల పాత్ర, కుటుంబంలో మరియు సంసారంలో మహిళా ఇబ్బందులు, పరిష్కారాలు, సూచనలు ఇలా నిత్యజీవితంలో జరిగే ఏవైనా అంశాలు రాయవచ్చు.

మీ కలానికి పదునుపెట్టే ఈ అవకాశాన్ని అందుకోండి..! రేపటి గొప్ప రచయిత్రి మీలో దాగి ఉండొచ్చు ! అన్వేషించండి!!

**సంపాదకుడు**








# ఎనభై ఏళ్ళ క్రితం

## తెలుగులో తొలి సినిమా తీసింది ముంబైలోనే







హెచ్. ఎం. రెడ్డి

**గత డిశంబర్‌లో తెలుగు చిత్రసీమకు 80 ఏళ్ళు నిండాయి. సుదీర్ఘ చరిత్ర గల మన తెలుగు చిత్ర సీమ వెనుక విచిత్రగాథ దాగివుంది. నేడు ఇంత వైభవంగా వెలుగుతున్న తెలుగు చిత్రసీమకు జన్మనిచ్చింది ముంబయి నగరం. తరాలతరబడి నాటినుండి నేటిదాక ముంబయితో చిత్రసీమ అనుబంధం కొనసాగుతూనేవుంది. తెలుగు చిత్రసీమలోని ప్రతి అంశంపై హిందీచిత్రసీమ కేంద్రబిందువైన ముంబయి ప్రభావం ఉండనేయుంటుంది. ఈ అనుభంధం విషయమై వివిధ కోణాలనుండి ప్రతి అంశాన్ని పరిశీలించి తెలియని ఎన్నోవిషయాల్ని మన ఆంధ్రమహాసభ సభ్యులకు అందించాలని కొంకల థామస్ రెడ్డి వ్రాసిన కొన్ని వ్యాసాల్ని ఈ సంచికలో పొందుపరుస్తున్నాము. ఆస్వాదించండి....**

2011 డిసెంబరుతో తెలుగు చలన చిత్రసీమకు 80 ఏళ్ళు నిండాయి, 80 ఏళ్ళ రమణీయ తెలుగు చిత్ర పరిశ్రమ గాథ, ఓ మనోహర గంగాప్రవాహంలా సాగింది. ఏకధాటిగా దాన్నొకసారి దర్శిస్తే తనువు పులకరిస్తుంది, మనసు పరవసిస్తుంది. ఎన్ని చెప్పుకున్నా, ఎంత రాసుకొన్నా తరగని గాథ అది. ఎంతో శ్రమకోర్చి హెచ్.ఎం. రెడ్డి మొదలుకొని సి.పుల్లయ్య, ఎల్వీప్రసాద్, కె.వి. రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి, తదితర అతిరథ మహారథులు మలచిన మరపురాని కళా ఖండాలెన్ని చిత్రసీమలో చెరగని ఆస్తిగా మనకు మిగిల్చి వెళ్లారు. అటు సాంకేతిక వర్గమైతేనేమి ఇటు కళాకారులైతేనేమి వారందరి సమిష్టి కృషితో అలనాటి మధురస్మృతులుగా అవి మనముందు నిలుస్తున్నాయి. బాక్సాఫీసులు, పెట్టుబడులు, లాభనష్టాల విషయాల్ని ప్రక్కనబెట్టి ఇక అసలు విషయానికొస్తే దేశంలో చిత్రపరిశ్రమ తొలుత పుట్టింది ముంబయిలోనే. అదికూడా 1931 మార్చిలో విడుదలయైన 'ఆలం ఆరా' (హిందీ) చిత్రంతోనే. అంతకుముందు (1913) నుండి ఏవోకొన్ని మూకీ చిత్రాలు రిలీజైనా 1931లో 'ఆలం ఆరా' టాకీ (శబ్ద) చిత్రం వచ్చేంత వరకు జనంలో చేతన పెరగలేదు. 'ఆలం ఆరా' నిర్మాత ఆర్థేషిర్ ఇరానీ ఐతే, ఆ తొలి భారతీయ చలన చిత్రానికి సహాయదర్శకుడిగా పనిచేసిందొక తెలుగు వాడేనంటే ఆశ్చర్యంగా యుందికదూ! అలాగే తెలుగులో తొలి చిత్రాన్ని సంపూర్ణంగా ముంబయిలోనే 15 రోజుల్లో తీసింది కూడా ఆ మహామనీషియే. పదిమంది నటుల్ని తెలుగుసీమ నుండి ముంబాయికి తీసుకువచ్చిన 15 వేల పెట్టుబడితో తొలి తెలుగు సినిమాని రిలీజుచేసిన ఘనుడాయన. ఆ తెలుగు దర్శకునికి ఇంకో రికార్డు కూడా ఉంది. హిందీలో 'విజయ కుమార్' చిత్రంతో పృధ్వీరాజ్ కపూర్‌ను సినీరంగ ప్రవేశం చేయించింది కూడా ఆయనే ! ఆయన మరెవరో కాదు మన హనుమప్ప మునియప్ప రెడ్డి. ఆయన్ని అందరూ ముద్దుగా హెచ్. ఎం. రెడ్డి అని పిలుస్తారు.



**1950 కాకినాడలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్ మహాసభల ముఖ్య అతిథి పృథ్వీరాజ్ కపూర్.**



ఎల్.వి. ప్రసాద్

తెలుగు చిత్రసీమకు ఆద్యుడైన ఈ హెచ్.ఎం.రెడ్డి కి ముంబైతో పెరిగిన అనుబంధం, చిత్ర పరిశ్రమలో ఆయనపడ్డ శ్రమ, ఆయన అందించిన సేవల్ని ఈ సందర్భంగా స్మరించుకోవడం ఎంతో సముచితం.

హెచ్.ఎం.రెడ్డి హైదరాబాదులో జాగీర్దార్ కాలేజీలో ఇంగ్లీషు మేష్టారుగా పని చేసేవారు. హైదరాబాదులో విజృంభించిన ప్లేగువ్యాధికి భయపడి ముంబయిలో అప్పటికే సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నిస్తున్న తన బావమరిది హెచ్.వి.బాబు దగ్గరకు వచ్చేశారు హెచ్.ఎమ్.రెడ్డి.ఆ తర్వాత అయనకు కూడా సినిమాల మీద కుతూహలం పెరిగి 1927లో ముంబయిలోని శారదా ఫిల్మ్ కంపెనీలో రిఫ్లెక్టర్ బాయ్‌గా పనికి కుదరాడు. ఆయనకూడ అక్కడక్కడా వేషాలువేస్తూ సినిమా టెక్నిక్‌ను కొంతవరకు అర్థంచేసుకోగలిగాడు. రెడ్డిలోని సృజనాత్మకతను అర్థంచేసుకొన్న శారదా పిల్మ్ కంపెనీ అధినేత భోగీలాల్ దవే కొంతకాలానికి శబ్దంలేని మూకీ చిత్రాల దర్శకత్వం వహించే బాధ్యత రెడ్డిగారికప్పజెప్పారు.

దానితో 1930లో పృధ్వీరాజ్ కపూర్ తొలిసారి నటించిన "ప్రిన్స్ విజయకుమార్" మూకీ చిత్రానికీ అ తర్వాత మరికొన్ని చిత్రాలకు రెడ్డి దర్శకత్వం వహించి కొంత అనుభవం గడించాడు. పిదప దవే జర్మనీకి వెళ్తూ రెడ్డిని ఆర్దేషిర్ ఇరానీకి పరిచయం చేసి వెళ్ళాడు. అంతే హెచ్.ఎం.రెడ్డి లోని సృజనాత్మకతను అర్థంచేసుకొన్న ఇరానీ అప్పుడే దేశంలో తొలిసారిగా హిందీలో తాను రూపొందిస్తున్న 'ఆలం ఆరా'కు అసిస్టెంట్ దర్శకత్వ బాధ్యతలు అప్పచెప్పారు. 'ఆలం ఆరా' తయారై, రిలీజయింది, సూపర్ హిట్టయింది. ఇరానీ దృష్టి ఇప్పుడు దక్షిణం వైపు మళ్ళింది. దక్షణంలో తెలుగు, తమిళంలో చిత్ర నిర్మాణంచేసే బాధ్యతలు హెచ్.ఎం.రెడ్డి కి అప్పచెప్పాడు ఇరానీ. అందుకు రెడ్డి తయారయ్యాడు. 1931లో తెలుగు సినిమా టాకీయుగం ప్రారంభమయ్యేనాటికి తెలుగు నాటనాలుగు చెరగలా పౌరాణిక నాటకాలు ఉధృత ప్రచారంలో ఉన్నాయి. అందుకని తాను నిర్మించబోయె చిత్రానికి పౌరాణిక నాటకాంశాన్నే ఇతివృత్తంగా తీసుకోవాలని రెడ్డి నిర్ణయించుకొన్నాడు. వాటిలోంచి విస్తృత ప్రచారంలో ఉన్న 'భక్త ప్రహ్లాద' నాటకాన్ని ఎన్నుకొన్నాడు. అప్పటికి ఆంధ్రాలో ఈ అంశంపై 19 నాటకసంస్థలు చెలామణిలో యున్నాయి. కానీ ఒకనాటి మరాఠీ గడ్డకు చెంది ఎన్నో తరాలనుండి ఆంధ్రలో స్థిరనివాసమేర్పరచుకొన్న 'సురభి' నాటక సమాజంవారు 'భక్తప్రహ్లాద' నాటక ప్రదర్శనలో అన్ని నాటక సంస్థలకంటే బహుళ ప్రచారంలో ఉన్న సంస్థ. అందుచేత రెడ్డిగారు ఆ నాటక సమాజానికి చెందిన ఓ పదిమందిని ముంబైకి తీసుకువచ్చి కృష్ణా మూవీటోన్ స్టూడియోలో ఈ సినిమా తీశారు. ఇది అంత సులువుగా తెరకెక్కలేదు. దీనికోసం రెడ్డిగారు ఎంతో శ్రమించారు. 'సురభి' వారిని సంప్రదించడం, వారందర్నీ బొంబాయికి రప్పించడం, వారితో పాడించడం, వారిలో ముఖ్యమైన వారిని ఎన్నిక చేయడం, వారికి పారితోషికాలతో పాటు చక్కటి వసతిని సమకూర్చడం మొదలైన పనులన్నీ తానే దగ్గరుండి నిర్వహించారు. ఇక్కడ రెడ్డిగారు దర్శకుడేకాదు, నిర్మాతకూడా. అన్ని శాఖలపై అజమాయిషీ చేయాలి. నటులంతా నాటక రంగానికి చెందిన వారు. శృతులు కలపడం లేదు. కెమెరా రేంజిలో నటులు నిలపడంలేదు. దూరంగా ఉన్న ఆర్కెష్ట్రాను ఫాలో కావాలి. ఇలా ఎన్నో ఇబ్బందులు. మొత్తానికి ఎలాగో ఓలాగ నటులను ముంబాయిలో పదేహేను రోజులు మకాం వేయించి సినిమా పూర్తీ చేశారు రెడ్డిగారు. ముంబయికి వచ్చిన వారిలో అందరికంటే బాగా పాడగల తొమ్మిదేళ్ళ అబ్బాయిని ప్రహ్లాదునిగా సెలెక్ట్ చేశారు రెడ్డిగారు. అతని పేరే సింధూరి కృష్ణారావు. ఆయనే తెలుగు చిత్ర సీమలో తొలి కథానాయకుడు (ఇటీవలే మరణించారు). ఖమ్మంలో పుట్టిన కృష్ణారావుకు ఆరోజుల్లో లభించిన పారితోషకం 400 రూపాయలే. ఆరోజుల్లో అదేగొప్ప. హిరణ్యకశిపుడిగా గుంటూరు జిల్లాకు చెందిన మునిపల్లె సుబ్బయ్యను, కథానాయికగా సురభివారి కమలాబాయి(18)ని, ప్రహ్లాదుని సహధ్యాయిగా ఎల్వీ ప్రసాద్ పాత్రలు పోషించారు. సినిమా నిర్మాణం పూర్తియైన తర్వాత కమలాబాయికి 1116 రూపాయలు పారితోషికం ఇచ్చి తిరిగి వారిని రైలెక్కించి తెలుగు గడ్డకు చేర్పించారు రెడ్డిగారు. అంతే 15.09.1931న చిత్రం రిలిజ్ అయింది. క్యూ అంటే ఎంటో తెలీదు ఆ రోజుల్లా దినానికి రెండుషోలే వీక్షించిన ప్రతి ప్రేక్షకుడి నోటనుండి అన్నీ "అహా ఓహో" లే అంతే. అలా మొదలైంది విచిత్రమైన తెలుగు చిత్రసీమకు దారి. కేవలం 15 వేల రూపాయల ఖర్చుతో 80 ఏళ్ళ క్రితం ముంబయిలో తెలుగు సినిమాకు ఆయన వేసిన పునాది నేడు వందలకోట్ల టర్నోవర్‌కు చేరిన పాలరాతి సౌధంలా బాసిల్లుతుంది మన చిత్రసీమ...



తొలి తెలుగు చిత్ర కథానాయిక
'సురభి' వారి కమలాబాయి

హ్యాట్సాఫ్ టు హెచ్.ఎం.రెడ్డి ...

# తెలుగు పల్లకిలో ఊరేగిన హిందీ సుస్వరాలు



'అక్బర్ సలీం అనార్కలి' తెలుగు చిత్రంలో పాటల రికార్డింగ్ సందర్భంగా మహమ్మద్ రఫీ, సినారె, సి. రామచంద్ర, పి. సుశీల

చిత్రసీమ ఎంతో విచిత్రమైనది. వినోదం కోసం ఒకనాడు అది ప్రారంభమైనా నేడు అది వేలకోట్ల టర్నోవర్‌తో ప్రపంచాన్నే కుదిపి వేస్తుంది. అందులో జరిగే గిమ్మిక్కులు, జిమ్మిక్కులు మరెక్కడ జరగవు. ఇందులో భాగంగా ముంబాయిలో తొలుత ప్రాణం పోసుకొన్న 'ఆలం ఆరా' పుట్టిన ఏడాదిలోనే అదే గడ్డపై తెలుగులో తొలిచిత్రం 'భక్త ప్రహ్లాద' పురుడు పోసుకున్నది. అలా హిందీ, తెలుగు రెండు సమాంతరంగా ఆ రోజుల్లోనే పయనం సాగించాయి. అందులో భాగంగా హిందీ చిత్ర సీమలో ఎందరో తెలుగు నిర్మాతలు, దర్శకులు, గాయకులు, నటులు నటీమణులు కేవలం సంబంధాలే గాక అన్యోన్యతను పెంచుకోవడమే గాక పెనవేసుక పోయారంటే కూడా అతిశయోక్తి కాదు.

జాతీయస్థాయిలో హిందీ పరిశ్రమలో వహీదా రెహ్మాన్ (బంగారు కలలు), శ్రీదేవి, జయప్రద, తాళ్ళూరి రామేశ్వరి (సీతామాలక్ష్మి) సుధా చంద్రన్ (మయూరి) తెలుగు పరిశ్రమ నుండి వెళ్లి అద్భుత స్టార్స్‌గా వెలుగొందారు. జమున కూడా రెండు హిందీ చిత్రాల్లో నటించి హిందీచిత్రసీమలో తన అకౌంట్ ముగించుకొంది. అలాగే హిందీ నుండి మీనాక్షి శేషాద్రి (విశ్వామిత్ర) మరాఠీ నుండి రోహిణి హట్టాంగడీ (సీతారామయ్య మనుమరాలు) తెలుగులో నటించడం మరో విశేషం. ఇలా చూస్తూ వెళ్తే ఇంకా ఎందరో ఉన్నారు

అది నాటి నుండి నేటి వరకు నిరంతరయానంలా కొనసాగుతూ ఎన్నో తెలుగు చిత్రాలు హిందీలో, హిందీ చిత్రాలు తెలుగులో, తెలుగు పాటలు హిందీలో, హిందీ పాటలు తెలుగులో అద్భుతంగా సూపర్ హిట్టయ్యాయి. తెలుగు చిత్రసీమలో స్వర్ణయుగంగా పిలువబడే 1950–1970 సం॥ల నడుమ ఎన్నో అద్భుత గాథలతో, సుమధుర గీతాలతో వచ్చిన ఆణిముత్యాల్లాంటి చిత్రాల్ని నేటి వయోవృద్ధులే గాక అబాలగోపాలం ఇప్పటికి మరువలేరు. ఎన్నో శ్రమల కోర్చి వారు ఆరోజుల్లో రాబోయే తరాలకు అందంచిన తరగని ఆస్తి అది. అలాంటి ఆణిముత్యాల్లో పొందు పరిచని కొన్ని గీతాలస్వరాన్ని, హిందీ గీతాల బాణీలో నుండి తీసుకోబడ్డాయి. అవి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచి పోయాయి.



'చదువుకున్న అమ్మాయిలు' చిత్రంలో పాట రికార్డింగ్ సందర్భంగా మరాఠీ అమ్మాయి ఆశాలతా కులకర్ణి

నాటి తెలుగు, హిందీ సినిమాల్లో కథావస్తువు, చిత్రీకరణ, నటీనటులు ఒక ఎత్తైతే పాటలు, కథతో పోటీపడి ఆరోజుల్లో రాయబడ్డాయి, పాడబడ్డాయి, చిత్రికరించబడ్డాయి. ఆదీ ఆనాటి స్పెషాలిటి ఆ రోజుల్లో చిత్రాలు చూసే ప్రేక్షకులకంటే పాటల నృత్యాలు చూడ్డానికి వెళ్లినవారే ఎక్కువ మంది అంటే అతిశయోక్తి కాదు. ఉదా॥ "సువర్ణ సుందరిలో" 'పిలువకురా ! అలుగకురా!' అనే పాట కోసం ప్రేక్షకులు ఎదురుచూసి ఎదురుచూసి పాట రాగానే హాలంతా కేకల్తో, ఈలల్తో హోరెత్తించేవారు. అలాంటి పాటల రాగాలెన్నో మనం హిందీ నుండి తెలుగు లోకి తీసుకొన్నాం.'సత్రంజ్' అనే హిందీ సినిమాలో 'బత్కమ్మ బత్కమ్మ ఎక్కడ పోతావ్‌రా!' అనే తెలుగు పదాల్ని నేరుగా వాడారు దర్శకుడు ఆనాడు. ఆ పదాలు, ఆ పాటకు అందాన్నిచ్చాయి ఆలాగే "రోజులు మారాయి" చిత్రంలోని "ఏరువాకా సాగారో" అనే పాటరాగాన్ని "బంబైకా బాబు"అనే హిందీ చిత్రంలో తీసుకొని 'చిన్నన్నా' అనే తెలుగు పదాన్ని నేరుగా తీసుకొన్నారు. అక్కడ అది బాగా హిట్టయింది. అంతేగాక, "భలే తమ్ముడు", "అక్బర్ సలీమ్ అనార్కలి" చిత్రాల్లో మహమ్మద్ రఫీ తెలుగులో నాలుగు పాటలు గీతాలాపన చేయగా 'చదువుకొన్న అమ్మాయిలు" చిత్రంలో ఆశాలత కుళకర్ని అనే మరాఠీ అమ్మాయి రెండు తెలుగు పాటలు పాడి ఈగడ్డ చేవ ఏంటో తెలుగు వారికి తెల్పింది. ఇక 1967లో 'మర్యాద రామన్న' చిత్రంతో రంగప్రవేశం చేసిన మన బాలసుబ్రహ్మణ్యం హిందీలో 'ఏక్‌దూజేకేలియే' చిత్రం ద్వార హిందీ శ్రోతలకి తన గాత్రాన్ని పరిచయం చేసి నేటికి కొనసా గిస్తున్నారు. ఇలా ఆదాన ప్రధానాలతో సాగిన నాటి గీత స్వరాల పరంపరను ఒక్కసారి చూద్దామా !.



1967 తొలి పాట రికార్డింగ్ సందర్భంగా బాలు

# సినీ సుస్వరాల ఆదాన ప్రధానాలు

## తెలుగు మధురిమలు ⇒ హిందీ సరిగమలు

| తెలుగు మధురిమలు | హిందీ సరిగమలు |
|---|---|
| ➤ నీలి మేఘమాలవో (మధన కామరాజు కథ)..... .... | ➤ చౌదవీకా చాంధ్ హెూ (చౌదవీకా చాంద్) |
| ➤ ఓ హెూ బస్తీ దొరసాని (అభిమానం)..... .... | ➤ లేకే పహెలా పహెలా ప్యార్ (నాగిన్) |
| ➤ వయ్యార మొలకే చిన్నదీ (మంగమ్మ శపథం)..... .... | ➤ ఫంక్ హెూతీతో ఉడ్ ఆతీరే (ఝునక్ ఝునక్ పాయల్ బాజే) |
| ➤ ఏరువాకా సాగారో (రోజులు మారాయి)..... .... | ➤ బంబయి సే ఆయాహై దిల్‌కా ఖిలోనా (బంబైకా బాబు) |
| ➤ పయనించే ఓ చిలుకా ఏగిరిపో (కులదైవం)..... .... | ➤ చల్ ఉడ్‌జారే పంచీ (బాబీ) |
| ➤ నీలి కన్నుల నీడలలోన (గుడి గంటలు)...... .... | ➤ హస్తహూఆ నూరానీ చెహరా (పారస్మని) |
| ➤ నీ మది చల్లగ నిదరో పో (ధన మా! దైవమా!)..... .... | ➤ ఖిల్‌తెహై గుల్ యహా (షర్మిలి) |
| ➤ తియ్య తీయని తెనెల (ఖైది కన్నయ్య)...... .... | ➤ తెరే ప్యారీ ప్యారీ సూరత్‌కో (ససురాల్) |
| ➤ రాధ రావే రాణీ రావే (శాంతి నివాసం)..... .... | ➤ జూంమ్‌తా మౌసం మస్త్ మహీనా (ఉజాలా) |
| ➤ పిలువకురా అలుగకురా (సువర్ణ సుందరి).... .... | ➤ ముఝేనా బులా (2) చుప్‌చుప్ చెలియ (నాగిన్) |
| ➤ ముత్యాలు వస్తావా(మనుషులంతా ఒక్కటే)).. .... | ➤ రూపుతేరా మస్తానా (ఆరాధన) |
| ➤ చక్కని దానా చిక్కనిదానా (శాంతి నివాసం)..... .... | ➤ దిల్ దేకే దేఖో (3) జీ (దిల్ దేకే దేఖో) |
| ➤ పద పదవె వయ్యారి గాలిపటమా (ఋణానుభందం) .... | ➤ చల్ చల్ రె పతంగ్ మెరి చెల్‌రే (కాంధాన్) |
| ➤ నా మది నిన్ను పిలిచింది గానమై (ఆరాధన)..... ..... | ➤ ఆజా తురుఝుకో పుకారే మేరే గీత్‌రే (గీత్) |
| ➤ గులాబి పువ్వై నవ్వాలి (అన్మదమ్ముల అనుబంధం). .... | ➤ చురాలియాహై తుంనే జో దిల్ కో (యాదోంకి బారాత్) |
| ➤ ఆనాటి హృదాయాల ఆనంద (అన్నదమ్ముల అనుబంధం)... | ➤ యాదోంకి బారాత్ నికిలీ (యాదోంకి బారాత్) |


## దర్పణం లో ప్రకటన రేట్లు

| | | | |
|---|---|---|---|
| బ్యాక్ కవర్ (ఫుల్ పేజి కలర్) | రూ॥ 3,000/- | బ్యాక్ కవర్ (ఇన్ సైడ్ కలర్) | రూ॥ 2,000/- |
| ఇన్‌సైడ్ కవర్ పేజి కలర్ | రూ॥ 2,000/- | బ్లాక్ & వైట్ ఫుల్ పేజి | రూ॥ 1,000/- |
| బ్లాక్ & వైట్ హాఫ్ పేజి | రూ॥ 600/- | బ్లాక్ & వైట్ పావు పేజి | రూ॥ 350/- |

- ప్రకటన సంబంధిత వివరాలు మాకు ప్రతి నెల 20వ తేది లోపు చేరాలి.
- చెక్కులు / డ్రాఫ్టులు :The Bombay Andhra Mahasabha & Gymkhana; పేరుమీద తీయాలి.
- సభ్యుల ప్రకటనలకు 10%(Discount) రిబేటు ఇవ్వబడును

మూడు నెలలకై, ఆరునెలలకై, సంవత్సరానికై ఒకే సారి అర్డర్ ఇచ్చు వారికి ధరలలో రాయితీలు ఇవ్వబడును. వివరాలకు సంప్రదించండి. ఫోన్ నం. 24144377/88.



నవరసాల జీవితంలోకి
ప్రుడుచుల సమ్మేళనంలా
సరసాల విందులతో సరికొత్త ఉగాది




**కస్తూరి హరిప్రసాద్**
**జన సంపర్క అధికారి - పద్మశాలి సమాజ సుదరక మండలి, వర్లి**

## తెలుగు సంస్కృతికి అద్దం పట్టే తెలుగు చిత్రాలు

మన తెలుగు సినిమా పుట్టినప్పట్నుండి నేటిదాకా 4,500 విడుదలైన చిత్రాల్లో 60 పౌరాణిక చిత్రాలు విడుదల అయ్యాయి. వాటిలో మహాభారత గాధను ఆధారంగా తీసుకొని 30 చిత్రాలు, రామాయణాన్ని ఆధారంగా తీసుకొని పది చిత్రాలు నిర్మించబడ్డాయి. అలాగే ఎంతో ప్రాచీనమైన మన తెలుగు సాంస్కృతి, సాహిత్యం, భక్తిరసాన్ని, వీరగాధల్ని కండ్లకు కట్టినట్లుగా మలచబడ్డ ఆణిముత్యాల్ని మీముందుంచుతున్నాం. అవే ఇవి.

1. రామదాసు (1931)
2. శ్రీ వెంకటేశ్వర మహత్యం (బాలాజి) (1939)
3. తెనాలి రామకృష్ణ (1941)
4. భక్త పోతన (1942)
5. త్యాగయ్య (1946)
6. పల్నాటి యుద్ధం (1947)
7. యోగి వేమన (1947)
8. మల్లీశ్వరి (1951)
9. పాతాళ భైరవి (1951)
10. కాళహస్తి మహత్యం (1954)
11. శ్రీ వేంకటేశ్వర మహత్యం (1960)
12. మహామంత్రి తిమ్మరుసు (1962)
13. అమర శిల్పి జక్కన (1963)
14. బొబ్బిలి యుద్ధం (1963)
15. రామదాసు (1963)
16. రాముడు భీముడు (1964)
17. మూగమనసులు (1964)
18. పల్నాటి యుద్ధం (1966)
19. భక్త పోతన (1966)
20. అల్లూరి సీతారామ రాజు (1974)
21. ముత్యాల ముగ్గు (1975)
22. భక్త కన్నప్ప (1976)
23. మహాకవి క్షేత్రయ్య (1976)
24. వేములవాడ భీమకవి (1976)
25. శ్రీ తిరుపతి క్షేత్ర మహత్యం (1977)
26. శ్రీ తిరుపతి వెంకటేశ్వర కళ్యాణం (1979)
27. సర్దార్ పాపారాయుడు (1980)
28. త్యాగయ్య (1981)
29. ఆంధ్ర కేసరి (1983)
30. బొబ్బిలి బ్రహ్మన్న (1984)
31. శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర (1984)
32. తాండ్ర పాపారాయుడు (1986)
33. వేమన చరిత్ర (1986)
34. బ్రహ్మనాయుడు (1987)
35. విశ్వనాధ నాయకుడు (1987)
36. సర్దార్ కృష్ణమ నాయుడు (1989)
37. పల్నాటి రుద్రయ్య (1989)
38. శ్రీనాథ కవిసార్వభౌమ (1992)
39. సమర సింహారెడ్డి (1999)
40. రారోరి రాజన్న (2011)

మహిళా దర్పణం...

# బాప్రే బాప్ !!!

ఆడవారిని సందర్భాన్ని బట్టి ఎన్నో పర్యాయ పదాలతో పిలుస్తుంటారు. గ్రాంధికంగా ఇవి ఎక్కువగా ప్రయోగంలో ఉన్నా పదాలు కొన్ని మాత్రమే నేడు వాడుకలో ఉన్నాయి. ఏమైనా ఇన్ని పేర్లతో పిలువబడే ఆడవారిని సందర్భాన్నిబట్టి ఆయాపదాలతో సంబోధిస్తూ మగాళ్ళు ముచ్చటిస్తూంటే మురిసిపోతుంటారు మగువలు. ఏమైనా ఒక్క వనితను ఇన్ని పదాలతో సంబోదిస్తుంటారనేది ఏక్కడైనా విన్నారా ?
ఒక్క సారిటు చుడండి....

| | | | |
|---|---|---|---|
| అంగన | చెలియ | పైదలి | యోష |
| అతివ | చెడియ | ప్రమద | రత్న |
| ఆదుది | బాన | భామ | రమణి |
| ఇంత | చేటి | భామిని | లలన |
| ఉవిద | జాన | మహిళ | లలామ |
| కలికి | జేటి | మగువ | లేమ |
| కళ్యాణి | తన్వి | మానిని | వనిత |
| కాంత | తరుణి | ముదిత | వలతి |
| కొమ్మా | నవల | మెలత | వెలది |
| కోమలి | నాతి | ముగుద | సుదతి |
| గోల | నారి | యువతి | |
| చెలి | నెలత | యుగ్మలి | |

ఇవన్నీ కాక ఇంకా బంధుత్వాన్ని, అన్యోన్యతను పెంచే పదాలైన అమ్మ, అక్క, అత్త, వదిన, తల్లి, చెల్లి, పిల్ల అనేవి కూడా ఉన్నాయి. ఇక అవన్నీ కలిపితే...?

– సేకరణ – ఆర్. సౌజన్య శ్రీనివాస్

## మరాఠీ సంస్కృతిని ప్రతిబింబించే తెలుగు చిత్రాలు

1. సతీ సక్కుబాయి (1931)
2. సారంగధర (1937)
3. తుకారాం (1938)
4. పాండురంగ విఠల్ (1939)
5. మాయల మరాఠి (1942)
6. ముగ్గురు మారాఠీలు (1946)
7. శ్రీ సాయి బాబా (1950)
8. పాండురంగ మహత్యం (1957)
9. భక్త అంబరీష (1959)
10. బాల నాగమ్మ (1959)
11. సతీ సక్కుబాయి (1965)
12. భక్త తుకారాం (1972)
13. శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం (1985)

సాహితీ దర్పణం

కవిత

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా....

# ఓ మహిళా !

అబల కాదు
"అమ్మ"కు నిలువెత్తు
నిర్వచనం నీవు
మనిషి "బొమ్మ"ను మలిచే
ఆ బ్రహ్మకు సైతం జీవం పోసిన
ఆది "జీవ నాడి"వి నీవు
మనిషి జన్మకు
మారు పేరు నీవు
మనుగడకు "మార్గం" నీవు
ఓ జగన్మాతా !
అన్నపూర్ణ నీవు
ఆదిశక్తి నీవు
అవని అంతా నీవు
ఆకాశమెంత నీ ఎదుట ?
కరుణ నీవు - శరణు నీవు
కడుపు నింపే బరణి నీవు
ఓర్పు నీవు - నేర్పు నీవు
ఒడి నీవు - గుడి నీవు
పెదవిపై తడినీవు
తొలి బడి నీవు
భుక్తినీవు - యుక్తినీవు
స్త్రీమూర్తి నీవు - మహిళా శక్తినీవు
మమతనీవు - సమత నీవు
సృష్టి నీవు - దివ్యదృష్టినీవు
సహనం నీవు- సర్వస్వం నీవు
మా "ఇలవెల్పు" నీవు
ఇంటి దీపం నీవు
అనురాగాల చెల్లి నీవు
అనుబంధాల కల్పవల్లి నీవు
నవమాసాలు మోసే "తల్లి" నీవు
జాలి నీవు జాగృతి నీవు
ఆలి నీవు - అర్థాంగీ నీవు
జన్మకు అర్థం తెలుపే 'అర్థం" నీవు
అన్నింటినీ మించిన "పరమార్థం" నీవు

ఆనంద భారతి
నడిమెట్ల యెల్లప్ప

కవిత

# సమూహంలో ఒంటరి

ఏదో అవ్యక్తానుభూతుల
మౌన తపస్సు నుండి
కళ్ళు తెరిచే సరికి-
నేనూ... నా తోడుగా ఒంటరితనం!

ఒంటరితనాన్ని కించపరుచొద్దు
అక్కడ చీకటి శిశిరాలపై
ఆకు పచ్చని వెలుగులు చిమ్మే
కోటి సూర్యుళ్ళున్నారు...

పాఠకుడు చదవని పద్యంలా
పాత పేజీల చిందరవందరలో
ఎక్కడో జారిపోయానేమో..
కానీ, నిప్పులు మూటగట్టుకున్న
అక్షర సమూహాన్నే...

ఒంటరితనమెప్పుడూ ఏకాకి కాదు
శూన్యం లాంటిదే అదీనూ..
ఉందా
లేదా అన్నది నిత్య సందేహమే!
నిజానికీ..,
నేనూ ఒంటరితనం వేర్వేరు కాదు-
నాలోకి నేను
ఒంటరితనం దారుల్లోనే
ప్రవహిస్తాను..
నా నుండి నన్ను
ఒంటరితనమే ఆవిష్కరిస్తుంది...

ఎప్పుడైనా
నేను ఒంటరిగా ఉన్నానంటే..
నా చుట్టూ..
అక్షర సందోహాలు
సందడి చేస్తున్నట్టే..!!

- సంగెవేని రవీంద్ర
09987145310

# 'యజ్ఞం'లా సాగిన సోమంచి' సేవలు

రచన - కొంకల థామస్‌రెడ్డి



**యజ్ఞన్నశాస్త్రి కారణజన్ముడు. ఆయన విలాస జీవితాన్ని ప్రశాంత జీవితాన్ని పేరు ప్రతిష్టల్ని ఆశించియుంటే ఈ ముంబయికి అంకితమయ్యేవాడు కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన్ను పట్టుదలగల్గిన నిష్కామ కర్మయోగి, ప్రజల మనిషి అనవచ్చు. వృత్తిరీత్యా ఉద్దండుడు, మేధాసంపత్తిలో అపర చాణక్యుడు, సేవారంగంలో అలుపెరుగని యోధుడు, కళారంగంలో నిత్యనూతన అన్వేషి, కలం పడితే ఆయనొక విశ్వసారస్వత బండాగారం.**

(గతసంచిక తరవాయి..)

" అణువు నడిగితే తెలియదా బ్రహ్మాండమంటే యేమిటో?
మనిషి మూలం చూడకోరితే మట్టి బెడ్డనుకలుసుకో..."

అని మహాకవి సినారె అన్నట్టు యజ్ఞన్నశాస్త్రిగారి జీవితాన్ని దగ్గర్నుండి చూసిన ఎందరో మహనీయులున్నారు. వీరి సేవలనుగూర్చి ఇక్కడే గాక తెలుగుసీమలో తెలిసిన వారెందరో ఉన్నారు. వాళ్లను కదిలిస్తే శాస్త్రిగారి ఎన్నో తెలియని విషయాలు బయట పడుతాయి. కానీ ఆయన జీవితాన్ని గూర్చి ప్రచారం గానీ, గ్రంధస్తం గానీ జరిగింది శూన్యం. ఆయన జీవితం ఒక పరచిన విస్తరి అన్నా తెరచిన పుస్తకం అన్నా పెద్ద తేడాలేదు. ఒక సంస్థకు గానీ ఒక రంగానికి కానీ ఆయన జీవితం పరిమితం కాలేదు. తెలుగువాళ్ళకే కాదు ఎవరికైన పర్లేదు ఎక్కడ తన సేవలవసరమైతే అక్కడ ఆయన నిలబడ్డారు. ప్రజల జీవితాల్లోకి ఆయన దూసుకెళ్ళాడే గాబట్టి అయన్ను ప్రజల మనిషి అన్నారు. సాహిత్య రంగంలో నైతేమి, సమాజ సేవలో నైతేమి, కర్తవ్య నిర్వహణలో నైతేమి ఆయన్ను గూర్చి ప్రజలకు తెలిసినంత తన కుటుంబీకులకు తెలియదనేది యధార్థం.

**<u>సాహిత్యరంగం -</u>**

1936లో లక్నోలో అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించిన మహాసభలకు హాజరైన తెలుగు ప్రతినిధులు ఇద్దరే ఇద్దరు. వారిలో అబ్బూరి రామకృష్ణారావు ఒకరైతే రెండవ వ్యక్తి ఆయన శిష్యుడు సోమంచి యజ్ఞన్న శాస్త్రి. అప్పటికి ఆయన వయసు 23 ఏళ్ళు. సుప్రసిద్ధ రచయిత ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగిన ఆ సభల అనుభవాల్ని ఆధారంగా చేసుకొని ఆ రోజుల్లోనే శాస్త్రి హాస్యస్ఫదమైన 'స్కెచ్' ఓ పత్రికకు రాశారు. అది ప్రచురితమైంది. అక్కడ మొదలైంది సోమంచి వారి సాహితీ ప్రస్థానం. అప్పటికింకా ఆయన ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత "హాస్యబ్రహ్మ" బమిడిపాటి కామేశ్వర రావు గారి శిష్యరికంలో నాటక రచనలో ఎన్నో మెళకువలు నేర్చుకొని కుందుర్తి, శీలావీర్రాజుల సహచర్యంతో వివిధ పత్రికల్లో ఎన్నో హాస్యభరిత వ్యాసాలు, స్కెచ్‌లు రాస్తూ ప్రజల నాల్కలపై నానుతూ 1938లో 'నామకరణ వివాద ప్రహసనం" అనే ఏకాంకిక రాసి ఆతర్వాత ఉద్యోగరీత్యా ముంబయికి చేరిన తర్వాత 1947 జనవరిలో 'విశ్వం పెళ్ళి' అను నాటకాన్ని రాశాడు. దాని తర్వాత 1953లో "ఈ సంసారం" అను నాటిక రాసి దాన్ని తొలుత ముంబయి ఆంధ్రమహా సభలోనే వేయించి దానివిజయం తర్వాత అది రాజమండ్రిలో ముద్రించబడి ప్రజల్లోకి వెళ్లిందీ సామాజిక నాటకం. అలానే 1954లో "ఆంధ్రజ్యోతి"లో ప్రచురితమైన వీరి 'పెద్ద మనుషులు', అదే సంవత్సరం తెనాలిలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీల్లో ఉత్తమ నాటికగా ఎంపికైంది. అలాగే వీరు రాసిన 'నిత్యానందం పెళ్ళి', 'జ్యోతి' మాసపత్రికలో, 'హద్దులు- సరిహద్దులు', 'సాహితి' మాస పత్రికలో, 'కాలక్షేపానికి' అనే ఏకాంకిక 'ఆంధ్రజ్యోతిలో, 'పేరయ్యరాజంట' నాటిక 'స్వాతి' మాస పత్రికలో, 'ఈసంసారం' మరియు "పెద్దమనుషులు" 'ఆంధ్రజ్యోతి'లో, ఆరోజుల్లో దారావాహికంగా ప్రచురితమయ్యాయి. అలాగే వీరు రాసిన ఎన్నో నాటికలు వీరి మిత్రుడు ప్రఖ్య శ్రీరామమూర్తి దర్శకత్వంలో ఆకాశవాణి వివిధ కేంద్రాల్లో ప్రసారం చేయబడ్డాయి. ఎంతో ప్రాచుర్యం పొందిన వీరి 'నిత్యనందం పెళ్ళి' (హాస్యనాటిక) ఆకాశవాణి మద్రాస్ కేంద్రం, 'హద్దులు-సరిహద్దులు' విజయవాడ కేంద్రం,

'కట్నం కోరని కళ్యాణం' 1960లో ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం, 'ఓ మనిషి నూతిలో పడితే' 1974 లో హైద్రాబాద్ కేంద్రం వారు ప్రసారంచేసి శాస్త్రిగారి పేరు తెలుగునేల నాలుగు చెరగులా వ్యాపింపజేశారు.

అంతేగాక 1943లో ముంబాయిలో స్థాపించబడ్డ ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటి పాఠశాల భవన నిర్మాణ ప్రాజెక్టు కోసం విరాళాలలకై తనవంతు సహాయంగా మిత్రులు, శ్రేయోభిలాషుల నుండి వివిధ రూపాల్లో వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో, ఎన్నో ఫండ్‌రైజింగ్ కార్యక్రమాలు నిర్వహించి అపారనిధి సేకరించగలిగారు. అందులో భాగంగా ఎందరో ప్రచురణకర్తల సాయం ఆర్జించారు. వీరు రచించిన 'లోకులు– కాకులు', 'విశ్వంపెళ్ళి', 'న్యాయం', 'రంగభూమి' మున్నగు నాటికల్ని రాజమండ్రిలో తన చిరకాలమిత్రుడు అద్దేపల్లి నాగేశ్వరరావుగారి సహాయంతో 1954–55లో ఉచితంగా ముద్రింపజేసి నాటిక ప్రదర్శకుల్ని ఎ.ఇ.ఎస్ పాఠశాల (ముంబయి) భవన నిర్మాణ సహాయర్థం తోడ్పడమని శాస్రిగారు ప్రతి ప్రచురణలోను వినతి పత్రాన్ని రాశారు. ఆ విధంగా కొంతనిధి సమకూరింది. అలాగే విజయవాడలోని నవోదయ పబ్లిషర్స్, మారుతి పబ్లికేషన్స్ కూడా 'పేరయ్య రాజంట', 'పాపం సోకని పతనం', 'నిత్యానందం', 'హద్దులు–సరిహద్దులు' నాటికలు ప్రచురించి పై భవన నిర్మాణార్థం విరాళాలు సేకరించి పంపారు. ఇలా సమకూరిన నిధితో పాఠశాల భవనం నిర్మించబడి 1964 నవంబర్ 15 న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి శుభహస్తాల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది.

ఇదిలా ఉండగా 1956–57లో మహాసభకు ఆధ్యక్షులుగా యున్న వి.ఆర్.స్వామి గారి కాలంలో మహాసభ బిల్డింగ్ కోసం ఫండ్‌రైజింగ్ కార్యక్రమం మొదలైంది. అందుకోసం సభలో సభ్యులసంఖ్య పెంచి ఎన్నో సావినీర్‌లు ప్రచురించి డోనర్ కార్డులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విరాళాలు సేకరించారు. అందులో భాగంగా ఆంధ్రమహాసభవారు శాస్త్రిగారు రచించిన 'కట్నం కోరని కళ్యాణం' (85 పెజీలు) నాటికను 1961 జనవరిలో ప్రచురించి విరాళాలు సేకరించారు. అలా కావలసినంత నిధి సమకూరిన తరువాత సభకు 1971–75 మధ్య యస్వీ శివరామకృష్ణయ్య అధ్యక్షులుగా నున్న కాలంలో రెండంతస్తుల అడ్మిస్ట్రేటివ్ బిల్డింగ్ తయారైంది.

**ఇలా పై రెండు ప్రధాన సంస్థలు బాల్యారిష్టాలతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు పెద్ద దిక్కుగా తాను ముందుకు వచ్చి తన కలాన్ని హలంగా మలచుకొని సాహిత్య పొలాన్ని దున్ని "నాటక" బీజాలు చల్లి జనంలో నవ్వులపంట పండించి ధనరాసుల్ని ప్రోగుచేసి ఊపిరాడని సంస్థలకు ఆరోజుల్లో ప్రాణభిక్ష పెట్టిన ధర్మదాత మన శాస్త్రిగారు.**

పైన తెలిపిన నాటకాలు, నాటికలే గాక "ఎవరికివారే యమునాతీరే"," హంతకులెవరు", "లోకులు కాకులు", "మందర విజయం"," వస్తుంది రాష్ట్రం, రాకేంచేస్తుంది", అనే హాస్యనాటికలెన్నో రాసి ముంబయి బావుటా తెలుగు నేల నాలుగు చెరగుల సగర్వంగా ఎగిరేట్టు చేశారు శాస్త్రిగారు. ఇలా వివిధ సామాజిక అంశాలతో హాస్యరసాన్ని గుప్పించి సందేశాత్మక నాటకాలందించడంలో దిట్టయైన శాస్త్రిగారి రచనల్ని సామాన్య ప్రేక్షకజన ఆదరణకు నోచుకొన్నవే. సీరియస్ సాహిత్యమైనా, కళాత్మకతతో కళకళలాడాలనే గురజాడ సందేశాన్ని ఆచరణయోగ్యం చేసిన అభ్యుదయ రచయిత యజ్ఞన్నశాస్త్రి.

శాస్త్రిగారి రచనల్లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎన్నో నాటకాల్ని ఆధారంగా చేసుకొని తెలుగులో స్వేచ్ఛానువాదంతో కొన్ని నాటకాల్ని కూడా రచించారు. వాటిలో ఇంగ్లీష్ నాటకకర్త జాన్ గాల్స్ వర్దీ 1910లో రచించిన 'జస్టిస్" నాటికను శాస్త్రిగారు 1955లో "న్యాయం" పేరుతో, 1902లో బెల్జియన్ రచయిత మారిస్ మేటర్‌లింక్ రాసిన "మోనా వానా"ను 1956లో 'కళ్యాణి' పేరుతో, రష్యన్ కథాసాహిత్యానికి ఆదిపురుషుడైన నికొలాయ్ గగోల్ 1836లో రాసిన "రెవిజోర్" నాటకాన్ని 1957లో "మహానుభావులు" పేరుతో, డాన్ యువాన్ కథ ఆధారంగా బెర్నార్డ్ షా రాసిన "మ్యాన్ అండ్ సూపర్‌మ్యాన్" నాటకాన్ని 1955లో "విశ్వం పెళ్ళి" పేరుతో, రోమన్ బాషలో ప్లౌటస్ రాసిన "ఆంఫిట్రియోన్" ఆదారంగా 1970లో "పాపం సోకని పతనం" నాటికలు రాశారు శాస్త్రిగారు. ప్రపంచ సాహిత్యంలో మేలుబంతులనిపించుకొన్న ఈ నాటికలన్నీ తెలుగులో విస్తృత ప్రాచుర్యం పొందడానికి కారకుడు యజ్ఞన్న శాస్త్రిగారే అంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఏది ఏమైన దశాబ్దాల తరబడి ఆయన ఉద్యోగరీత్యా ముంబయిలోనే ఉండిపోవడం వల్ల ఆయన ప్రమోటర్లు ఎవరు లేకపోవడంవల్ల ఈ తొలితరం రచయితకు అనుకొన్నంత ప్రాచుర్యం లభించలేక పోయింది.

ఇవేగాక మరాఠీలో సుప్రసిద్ధ నాటికలుగా పేరొందిన విజయ్ తెండూల్కర్ గారి "శాంతత - కోర్ట్ చాలూ ఆహే", "హిమాలయ్‌చి సావళి" లాంటి నాటికలతోపాటు ఎన్నో అవార్డులు పొందిన మరాఠీ కథలనుకూడా తెలుగులోకి అనువదించిన ఘనుడీ శాస్త్రిగారు. అలాగే ఆంగ్లంలో "ది ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా"(వార పత్రిక)లో వీరి కలంనుండి జాలువారిన ఎన్నో కథలు, వ్యాసాలు ధారావహికంగా ప్రచురింపబడుతూ పోయాయి. అదే విధంగా తెలుగు నాటకరంగ చరిత్రను తెలిపే "ది తెలుగు లిటరేచర్ అండ్ థియేటర్" అనే శాస్త్రిగారి ఆంగ్లరచన (80పేజీలు)ను ఆంధ్రమహాసభవారు 1975 జనవరిలో ప్రచురించారు.

(సశేషం...)

## URGENTLY REQUIRED

**For the following posts at The Bombay Andhra Mahasabha & Gymkhana**

**1. Manager (Post 1)**

**Age : 30 - 40 yrs. Min. Qual.: B.Com**

With Knowledge of English, Hindi, Marathi & Telugu language besides Computer proficient preferably Tally software

Should also be very proficient in verbal and written communications.

**2. Office Asst. (Post 1)**

**Age : 22 - 40 yrs, Min. Qual.: 12th**

With knowledge of English, Hindi, Marathi & Telugu languages. Knowledge of Computer skills is a must.

Should also be very proficient in verbal and written communications

**3. Accountant / Cashier**

**Age : 22 - 40 yrs. Min. Qual.: B.Com graduate**

With experience in book keeping and auditing candidate should be conversant with computer knowledge in Tally systems as additional and would be given preference for short listing.

Salary is negotiable

Apply or E-mail your CV immediately mentioning the post applied for with present and expected salary & other details before **15th April 2012** to

**The General Secretary, The Bombay Andhra Mahasabha & Gymkhana, 10/C, L. Nappoo Rd, Hindu Colony, Dadar (E), Mumbai - 400 014. Phone: 2414 4377/88**
**email.: *mahasabha@gmail.com***

**కింద ఇవ్వబడిన పోస్టులకు దరఖాస్తులు వేంటనే కావలెను.**

మేనేజర్–(01),అఫీస్ అసిస్టెంట్ –(01),అకౌంటెంట్/క్యాషియర్ –(01)

**మేనేజర్ –** వయస్సు – 30 నుండి 40 సంవత్సరాలు లేదా ఏదైనా డిగ్రీ, కంప్యూటర్, ట్యాలి, వర్డ్, ఎక్సెల్, తెలుగు, ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషలపై అవగాహన కలిగి ఉండవలెను.

**అకౌంటెంట్ / క్యాషియర్ –** వయస్సు 22 నుండి 40 సంవత్సరాలు, విధ్యార్హత B.Com. Graduate, Book keeping & Auditing అనుభవము కలిగి యుండాలి. కప్యూటర్ మరియు ట్యాలి తెలిసి యుండాలి.

**ఆఫీస్ అసిస్టెంట్ –** వయసు 22 నుండి 40 సంవత్సరాలు, 12వ తరగతి, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మరాఠీ భాష అవగాహన కలిగి ఉండవలెను.

వివరాలకు – మీ బయోడేటాతో మహాసభ అఫీస్‌లో
15 ఏప్రిల్ 2011 లోపు సంప్రదించండి

**అడ్రసు –**
**ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా**
**10/సి, లఖంసీనపూ రోడ్, హిందు కాలని, దాదర్ (ఈస్ట్), ముంబయి – 400 014, ఫోన్.– 022 – 24144377 / 88**


# స్త్రీ స్వరూపం

పట్టు పరికిణీతో, కాళ్ళకు అందెలతో
మురిపించే చిన్నారి పాపంటే
అమ్మానాన్నలకు ముద్దు.
అలకలతో, గిల్లికజ్జాలతో
అలరించే చెల్లెలంటే
అన్నలకు, అక్కలకు ఆనందం.
తెలివిగా పాఠాలు చదివి
ఆటపాటల్లో ముందుండే శిష్యులంటే
ఉపపాధ్యాయులకు మెప్పు.
మెట్టినింట అన్నీ తానై మెలిగే
అందరినీ ఆదరించే ఆమంటే
అత్తమామలకు అభిమానం.
గెలుపులో, ఓటమిలో
తోడూ నీడగా వుండి మెలిగే
భార్యంటే, భర్తకు అనురాగం.
దేశం మెచ్చేలా, బిడ్డలను తీర్చి దిద్దిన
తల్లిగా ఆమెంటే అందరికీ ఆదర్శం.
అదీ నాటి భారత స్త్రీ రూపం.....

మరి నేడో?
ఆడపిల్లలే వద్దనే అమ్మానాన్నా ;
దుర్యోధన, దుశ్వాసనులున్న కాలేజీలూ;
యాసిడ్ దాడులతో, కత్తిపోట్లతో
బెదిరించే విద్యార్థులూ;
కట్నాల కోసం, సజీవ దహనాలు చేసే
అత్తింటివారూ;
విడాకులూ, విడిపోవటాలూ ఇలా ఎన్నో మరెన్నో
నేడు స్త్రీకి మనమిచ్చే బహుమానాలూ
బహుమతులూ.
మరికవద్దు వద్దు యాసిడ్ దాడులూ;
చాలు చాలు కట్నాల చావులూ;
కోరుకుందాం గాంధీ కలలు కన్న స్త్రీ స్వాతంత్ర్యం;
ఎదురు చూద్దాం ఆమంచి రోజు కోసం;
నమస్కరిద్దాం సృష్టికి ప్రతిసృష్టిచేసే ఆ స్త్రీ మూర్తికి.

పొన్నూరి భారత లక్ష్మి

# చరిత్రలో ఈరోజు ప్రత్యేకత...

## మార్చి

| తేదీ | సందర్భం | కాలం |
|---|---|---|
| 8. | అంతర్జాతీయ మహిళా దినోత్సవం | 1975 నుండి |
| 8. | దామెర్ల రామారావు (చిత్రకారుడు) జయంతి | 1897 - 1925 |
| 9. | బెజవాడ గోపాల రెడ్డి వర్ధంతి | 1907 - 1997 |
| 12. | దండి ఉప్పు సత్యాగ్రహం ప్రారంభం | 1930 లో |
| 13. | బూర్గుల రామకృష్ణా రావు జయంతి | 1899 - 1967 |
| 14. | ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (శాస్త్రవేత్త) జయంతి | 1879 - 1955 |
| 15. | అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం | 1962 నుండి |
| 16. | పొట్టి శ్రీరాములు జయంతి | 1901 - 1952 |
| 17. | రాయప్రోలు సుబ్బారావు (కవి) జయంతి | 1892 - 1984 |
| 17. | ప్రపంచ వికలాంగుల దినోత్సవం | 1981 నుండి |
| 22. | సరోజినీ నాయుడు వర్ధంతి | 1879 - 1949 |
| 23. | భగత్‌సింగ్ నిర్వాణ | 1907 - 1931 |
| 24. | క్షయవ్యాధి నిర్మూలన దినం | 1982 నుండి |
| 27. | ప్రపంచ రంగస్థల దినోత్సవం | 1960 నుండి |
| 28. | చిత్తూరు నాగయ్య (నటుడు) జయంతి | 1904 - 1973 |
| 28. | పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి | 1905 - 1990 |
| 29. | టెన్సింగ్ నార్కే ఎవరెస్ట్ శిఖరారోహణం | 1953 లో |
| 30. | జమలాపురం కేశవరావు వర్ధంతి | 1908 - 1953 |

## ఏప్రిల్

| తేదీ | సందర్భం | కాలం |
|---|---|---|
| 1. | డా॥ హెగ్డేవార్ జయంతి | 1889 - 1940 |
| 2. | ప్రపంచ బాలల పుస్తకదినోత్సవం | 1967 నుండి |
| 3. | ఛత్రపతి శివాజీ వర్ధంతి | 1630 - 1680 |
| 4. | మార్టిన్ లూథర్ కింగ్ నిర్యాణం | 1928 - 1968 |
| 5. | బాబూ జగ్జీవన్ రామ్ జయంతి | 1908 - 1986 |
| 7. | ప్రపంచ ఆరోగ్యదినోత్సవం | 1950 నుండి |
| 7. | పండిట్ రవి శంకర్ జన్మదినం | 1920 |
| 8. | బంకించంద్ర చటర్జీ వర్ధంతి | 1838 - 1894 |
| 12. | మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు | 1975 లో |
| 13. | జలియన్ వాలాబాగ్ దురంతం | 1919 లో |
| 14. | డా॥ అంబేద్కర్ జయంతి | 18 - 1956 |
| 15. | గురునానక్ జయంతి | 1469 - 1539 |
| 16. | దేశంలో మొదటి రైలు ప్రారంభం | 1853 లో |
| 16. | తెలుగు రంగస్థల దినోత్సవం | 2006 నుండి |
| 18. | ప్రపంచ వారసత్వ దినోత్సవం | 1972 నుండి |
| 22. | ధరిత్రి దినోత్సవం | 1970 నుండి |
| 23. | ప్రపంచ పుస్తక దినోత్సవం | 1995 నుండి |
| 26. | ఆంధ్రా యూనివర్సిటీ స్థాపన | 1926 లో |
| 29. | రాజా రవివర్మ (చిత్రకారుడు) జన్మదినం | 1848 - 1906 |
| 29. | వావిలాల గోపాల కృష్ణయ్య వర్ధంతి | 1906 - 2003 |
| 30. | దాదాసాహెబ్ ఫాల్కే జయంతి | 1870 - 1944 |

## డియర్ మెంబర్స్




**"దర్పణం" పట్ల మీ అభిమానాన్ని కవితలు, కథల పట్ల మీ అభిప్రాయాలను మాకు తరచుగా ఉత్తరాలు, లేదా ఎస్ఎమ్ఎస్ ద్వార తెలియజేస్తూ మీ ఉత్తమాభిరుచిని వ్యక్తం చేస్తున్న విధానం మా కెంతో ఆనందం కలిగిస్తోంది. మీ అభిప్రాయాలకు ప్రతిబింబంలా "దర్పణం" తీర్చిదిద్దుతామని హామి ఇస్తున్నాము. దర్పణం' గురించి మీ అభిప్రాయాలు రాయండి.**

**మీ**
**ప్రధాన సంపాదకులు**

## సభ్యులకు మనవి

- ✡ మీ చిరునామా గానీ, ఫోన్ నెంబర్ గానీ మారితే రాసి పంపండి.
- ✡ కవితలు, జోక్స్, వింతలు విశేషాలు, చిన్న కథలు ఇంట్లాంటివి రాసి పంపండి.
- ✡ సభ్యులు ఏదైనా సామాజిక, సాంస్కృతిక, సాహితీ, క్రీడా, విద్య మున్నగు రంగాల్లో ఏదేని అవార్డు రివార్డు పొందినట్లయితే మాకు తెలుపండి.... ప్రచురిస్తాం.
- ✡ రచనలు తమ స్వంతమని హామీ పత్రం జతచేయండి. ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలకు, వాద వివాదాలకు తావు లేదు.
- ✡ పెండ్లిరోజులు, పుట్టిన రోజుల వివరాలు తెలుపండి.


ముంబయి తెలుగు ఎడ్యుకేషన్ సొసైటీ
MUMBAI TELUGU EDUCATION SOCIETY
मुंबई तेलुगु एज्युकेशन सोसायटी
(Education is Path of our Progressive Life)
Manthena Ramesh
MTES's
Disha
Technical Institute
FREE
VACATION BATCHES FOR :
Computer Courses
Drawing Classes
Calligraphy
Mehandi Courses
MTES's Disha Technical Institute is offering a good opportunity for interested people, and introducing ABOVE MENTIONED COURSES FREE for Poor people.
: FOR MORE INFORMATION CONTACT :
Disha
Technical Institute
MTES Computer Classes

"**Darpanam**" The official inhouse monthly news letter of "The Bombay Andhra Mahasabha & Gymkhana"
*(For Members only)*

## అసలు సిసలు ఉగాది పచ్చడి !

పిడికెడు స్నేహం...
చారెడు సంతోషం...
తగినంత సహనం...
గరిటెడు నిజాయితీ...
కొద్దిగా హాస్యం...
చిటికెడు కోపం...



## నందన నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

### తయారు చేసే విధానం:

జీవితమనే పాత్రలో పైన పేర్కొన్న పదార్థాలన్నింటిని చేర్చి ప్రేమ అనే గరిటెతో బాగాకలపండి. అడిగిన వారికీ అడగని వారికీ కూడా సహృదయంతో ధారాళంగ పంచండి.

### తీసుకోవలసిన జాగ్రత్తలు:

అవసరమైనప్పుడు స్నేహాన్ని కాస్తంత ఎక్కువ మోతాదులో తీసుకోండి. హాస్యాన్ని మాటలతో జాగ్రత్తగా కొలవండి. సంతోషాన్ని స్వార్థమనే కప్పులో మాత్రము కొలవకండి. తయారు చేసుకున్న ఉగాది పచ్చడికి ఆనందమనే ఫలాన్ని చేర్చి అలంకరించండి.





*Wish you*
*Happy Ugadhi*
*&*
*New Year*

**రాజగిరి అశోక్**